## మైనార్టీ డిక్లరేషన్ ఎటుపోయింది : జహంగీర్

సమావేశంలో మాట్లాడుతున్న జహంగీర్

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 4 : ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన మైనార్టీ డిక్లరేషన్ ఎటుపోయిందని ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జహంగీర్, జిల్లా అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ ప్రశ్నించారు. మైనార్టీ డిక్లరేషన్, వక్ఫ్ భూముల పరిరక్షణ, మైనార్టీల సమస్యలపై పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ఆవాజ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన డిక్లరేషన్‌ను నమ్మి ముస్లింలు కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారన్నారు. కానీ.. అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా దాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. మైనార్టీ డిక్లరేషన్‌లో రిజర్వేషన్లు పెంచుతామని, మైనార్టీ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని, స్వయం సహాయక స్కీమ్‌లు ఏర్పాటు చేస్తామని, బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయిస్తామని కాంగ్రెస్ మాయ మాటలు చెప్పి మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా మైనార్టీలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కొండమడుగు నర్సింహ, నాయకులు బట్టుపల్లి అనూరాధ, కల్లూరి మల్లేశం, బట్టు రామచంద్రయ్య, యాకూబ్, హిమామ్ పాషా పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి : బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకుడు ఉప్పలయ్య

ఆత్మకూరు(ఎం), ఫిబ్రవరి 4 : ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు బాషబోయిన ఉప్పలయ్య అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటినా ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదన్నారు. ప్రజాపాలన పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తూ నిర్బంధ పాలన సాగిస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలు తరిమికొట్టడం ఖాయమని పేర్కొన్నారు. కులగణన శాస్త్రీయంగా చేపట్టకుండా బీసీలను మోసం చేసిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, భానుప్రకాశ్, మాజీ ఎంపీటీసీ యాస కవిత, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ, నాయకులు రాజు, శంతన్‌రాజు, నాగరాజు, అజీమ్, పరశురాములు, ఉపేందర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

## రాక్‌వుడ్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

● బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేశ్

ఎంఈఓ సురేశ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

బీబీనగర్, ఫిబ్రవరి 4 : విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే వసంత పంచమి పేరుతో అక్రమంగా అడ్మిషన్లు చేస్తున్న రాక్‌వుడ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్‌వీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కి నగేశ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో ఎంఈఓ సురేశ్‌రెడ్డికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రాఘవాపురం గ్రామ శివారులో నూతనంగా ప్రారంభిస్తున్న రాక్‌వుడ్ స్కూల్ యాజమాన్యం విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేపడుతూ వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తుందని అన్నారు. పాఠశాలల్లో సరైన మౌలిక వసతులు, నీటి సౌకర్యం, మరుగుదొడ్లు కరువయ్యాయని తెలిపారు. పాఠశాలల్లో ఫైర్ సేఫ్టీ లేదని, ఫిట్‌నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో కూడా పాఠశాలను కొనసాగిస్తూ విద్యార్థుల మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్ల పేరుతో డబ్బు వసూలు చేస్తున్న స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎండీ మున్నా, మండలాధ్యక్షుడు పచ్చిమట్ల వంశీగౌడ్ పాల్గొన్నారు.

## 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే విజయం'

పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బీబీనగర్, ఫిబ్రవరి 4 : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు పిట్టల అశోక్, మాజీ సర్పంచ్ మల్లగారి శ్రీనివాస్ అన్నారు. బీఆర్ఎస్ బీబీనగర్ పట్టణ శాఖ అధ్యక్షుడు గోలి సంతోష్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం పార్టీ అభ్యర్థుల విజయానికి అనుసరించవలసిన విధి విధానాలపై వార్డుల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు గుంటుపల్లి లక్ష్మీనారాయణ, మిట్టు, దేవరకొండ శ్రీనివాస్, సోమ శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, మురళి పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి : సీపీఐ

డీటీ పూర్ణచందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆలేరు టౌన్, ఫిబ్రవరి 4 : అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలనుపాక గ్రామంలోని సర్వే నంబర్ 8లో రెండు కరాల ప్రభుత్వ స్థలం ఉన్నదని, అందులో అర్హులైన నిరుపేదలకు ఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చేవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిప్యూటీ తాసీల్దార్ పూర్ణచందర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పోతు ప్రవీణ్, భవాని, సరిత, కవిత, విజయ, లక్ష్మి, సంతోష్, మౌనిక, క్రాంతి, సంధ్య, యాదమ్మ, ఉప్పలమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

**PUBLIC NOTICE**

Under the instructions of my client, **Mr.Yarakala Chaitanya Kumar**, this notice is hereby given to the general public that my client is the owner of the property bearing Open Plot and Plot bearing No. 64/South Part and 64/ North Part, in Sy Nos., 4AA/3, 4/E and 152/E, in Municipal Block No. 13, total admeasuring an extent of 180 Sq. Yds or 150.49 Sq. Mtrs situated at Yadagiripally Village, Yadagirigutta Mandal, Yadadri Bhongir District, under Yadagirigutta Municipal Limits, having purchased the same vide Regd. Sale Deed bearing Doc. No. 7332/2024 dated 17-05-2024 from Yerukala Vijaya Kumar Rep by his AGPA Holder Murarisetti Haribabu.

It is informed to the general public that, my client has lost/misplaced the original link title document of the property i.e Regd. Sale Deed bearing Doc. No. 20619/2015 in favour of Chitharla Sreenivas and Regd. Sale Deed bearing Doc.No.191/2016 in favour of Chittarla Narsimha Goud and the same are not available in original with my client.

It is further informed that, any person who has found or who finds the above mentioned Original Title Deed, may return the same by way of registered post to the address given below or inform the undersigned by telephone, any person/(s) having any objections, claims, right, lien, title over the said property may please contact the under signed within **10 days** from the date of publication of this notice with relevant documents in support of their claim.

**Date: 04.02.2025**

Sd/- **SRIRAM REGANI,**
Advocate
Flat no # 307, MNK'S Vittal's Central Court, New Bhoiguda, Secunderabad, PIN Code # 500003. **Contact # 9849781090**

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో నిబంధనలు తప్పక పాటించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 4 : వరంగల్ – ఖమ్మం – నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియమ నిబంధనలను తప్పక పాటిస్తూ విధులు నిర్వహించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి నోడల్ ఆఫీసర్లకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నోడల్ అధికారులు రోజు వారీ రిపోర్టులను సరైన సమయంలో పంపాలన్నారు. జిల్లాలో 985 మంది ఓటర్లు ఉన్నారని, వారు సకాలంలో వచ్చి ఓటు హక్కు వినియోగించుకునేలా తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన మెటీరియల్‌ను సకాలంలో చేర్చాలన్నారు. 17 పోలింగ్ కేంద్రాలకు ఆరు రూట్ల ద్వారా 17 మండలాలకు బ్యాలెట్ బాక్సులు పంపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాలకు పంపే ముందు ఒకసారి పరిశీలన చేయాలన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, నోడల్ అధికారులు, సూపరింటెండెంట్‌లు రామారావు, శాంతీలాల్, డీటీ సురేశ్, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

## పిల్లాయిపల్లి కాల్వ ద్వారా మూసీ జలాలను మళ్లించాలి

● ఆందోళ్‌మైసమ్మ జలసాధన సమితి నాయకులు

జలసాధన సమితి ప్రణాళిక కరపత్రాన్ని విడుదల చేస్తున్న నాయకులు

చౌటుప్పల్, ఫిబ్రవరి 4 : మూసీ జలాలను పిల్లాయిపల్లి కాల్వ ద్వారా లక్కారం, డి.నాగారం, దండు మల్కాపురం, ఖైతాపురం తదితర గ్రామాల చెరువులకు మళ్లించాలని, ఇందు కోసం ఆయా గ్రామాల ప్రజలు ఐకమత్యంతో ముందుకు పోవాలని ఆందోళ్‌మైసమ్మ జలసాధన సమితి ప్రతినిధులు అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో మంగళవారం సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లా సరిహద్దులోని కొత్తగూడెం, పోచంపల్లి ప్రాంతాల మధ్యలో మూసీ జలాలు పిల్లాయిపల్లి కాల్వ ద్వారా మైసమ్మ కత్వలో కలుస్తున్నాయన్నారు. వాటిని ఎత్తిపోతల ద్వారా మండలంలోని దండు మల్కాపురం చెరువులోకి మళ్లిస్తే తద్వారా ఖైతాపురం, లక్కారం, చౌటుప్పల్, తాళ్లసింగారం, లింగోజిగూడెం, పంతంగి, ఆరెగూడెం, నల్లగొండ జిల్లా చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి, ఏపూర్ గ్రామాల చెరువులు, కుంటల్లోకి నీరు చేరుతుందని తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అనంతరం జలసాధన సమితి ప్రణాళిక కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో జలసాధన సమితి ప్రతినిధులు కంచరకుంట్ల వెంకట్‌రెడ్డి, మెట్టు సుదర్శన్‌రెడ్డి, గోపి సుధాకర్, ముత్యాల భూపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు ఆకుల ఇంద్రసేనారెడ్డి, కొయ్యడ సైదులు గౌడ్, కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, గుండెబోయిన వెంకటేశం యాదవ్, ఊదరి వెంకటేశ్ మహాజన్, కాసర్ల నర్సిరెడ్డి, గోపనబోయిన మహేశ్ యాదవ్ పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ సమస్యలపై మార్చి 10న ధర్నా

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 4 : సీనియర్ సిటిజన్స్ సమస్యల పరిష్కారం కోసం మార్చి 10న ధర్నా నిర్వహిస్తున్నామని, ధర్నాలో ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొనాలని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు అన్నారు. పట్టణంలోని రిటైర్డ్ ఉద్యోగుల భవనంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా, మండల, గ్రామాలో ఉన్న సీనియర్ సిటిజన్స్ సభ్యులు డిమాండ్లను సాధించే వరకు ఐక్యతతో పోరాటం చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన కన్సెషన్లు ఇంతవరకూ రావడం లేదన్నారు. ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట వెంకటేశం, ఆర్గనైజింగ్ కార్యదర్శులు నర్సింహారావు, సభ్యులు కూచిపట్ల సత్యనారాయణరెడ్డి, విజయమనోహర్, పూర్ణచంద్ర రాజు, దశరథ, భిక్షపతి, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలి

● ప్రజాఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బట్టు రామచంద్రయ్య

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయకర్త రామచంద్రయ్య

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 4 : ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని ప్రజా ఫ్రంట్ జిల్లా సమన్వయకర్త బట్టు రామచంద్రయ్య అన్నారు. పట్టణంలోని ఓ హోటల్లో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రజాఫ్రంట్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సంవత్సరం గడిచినా అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. రైతు భరోసా ఇవ్వడంలో జాప్యం చేస్తుందని, రుణమాఫీ ఇంకా చాలా మందికి కాలేదని తెలిపారు. కౌలు రైతులను ప్రభుత్వం గుర్తించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నాయన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల గ్రామ సభల ద్వారా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితాలో అనేక మంది అనర్హులను ఎంపిక చేశారని, నిజమైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హుల పేర్లను గ్రామసభలో పెట్టి జాబితా నుంచి తొలగించారని, రేషన్ కార్డులు ఏ ప్రాతిపదికన ఇస్తున్నారో తెలియజేయడంలేదని అన్నారు. రేషన్ కార్డుల జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులు, ధనిక రైతుల పేర్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. గ్రామ సభల్లో ప్రవేశపెట్టిన జాబితాలను సరిచేసి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాశపాక మహేశ్, రాసాల నర్సింహ, ఉపాధ్యక్షుడు కావలి యాదయ్య, సహాయ కార్యదర్శులు రాసాల బాలస్వామి, చిక్కుల కరుణాకర్ పాల్గొన్నారు.

## 'నేటి దేశవ్యాప్త నిరసనను జయప్రదం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక, రైతు సంఘాల నాయకులు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 4 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం దేశవ్యాప్తంగా జరిగే నిరసనలో కార్మికులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కార్మిక, రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్మిక, రైతు సంఘాల సంయుక్త సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ కొల్లూరి రాజయ్య మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 2025 బడ్జెట్‌లో కార్మికులకు, రైతాంగానికి నిరాశ మిగిల్చిందన్నారు. కార్మిక చట్ట సవరణలు ఉపసహరించుకోవాలని, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని, అధిక ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. భువనగిరి, యాదగిరిగుట్ట, ఆలేరు, చౌటుప్పల్ కేంద్రాల్లో నిరసన తెలుపాలని సమావేశంలో నిర్ణయించినట్లు తెలిపారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోరేటి రాములు, ఎండీ ఇమ్రాన్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు కళ్లెం అడివయ్య, గడ్డం నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు సిద్దులు, మాయ కృష్ణ, సామల శోభన్‌బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

## వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి : ఏఓ సుధారాణి

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 4 : వరి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి ఐ.సుధారాణి అన్నారు. మండలంలోని సాధువెల్లి గ్రామంలో మంగళవారం ఆమె వరి పొలాలను సందర్శించారు. వరిలో కాండం కుళ్లు తెగులు కనిపిస్తే లీటరు నీటికి హెక్సాకొనజోల్ 2మిల్లీలీటర్లు, ప్రొపికొనజోల్ 1మి.లీ. చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. పోషక లోపాలను గుర్తిస్తే లీటర్ నీటికి 13:00:45 పది గ్రాములు, చిలామిన్ జింక్ ఒక గ్రామ్ చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

## రాయగిరి చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భువనగిరి కలెక్టరేట్, ఫిబ్రవరి 4 : పట్టణ పరిధిలోని రాయగిరి గ్రామ చెరువులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం లభ్యమైంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయగిరి చెరువులో గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు మంగళవారం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే వచ్చి చెరువులో తేలియాడుతున్న మృతదేహాన్ని బయటకు తీసి భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వయస్సు 35–40 ఏండ్ల మధ్య ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని రూరల్ సీఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు. హత్యా, ఆత్మహత్యా అనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నామన్నారు.

## బెల్ట్ షాపుపై పోలీసుల దాడి
### రూ.20వేల మద్యం పట్టివేత

మోత్కూరు, ఫిబ్రవరి 4 : మున్సిపాలిటీలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్ షాపుపై పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేశారు. పట్టణ పరిధిలోని కొండగడప వెళ్లే రూట్‌లో ప్రధాన రహదారి వెంట బెల్ట్ షాపులో మద్యం విక్రయిస్తున్నారన్న సమచారంతో పోలీసులు తనిఖీ చేసి 20,130 రూపాయల విలువైన సరుకును స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు వడకాల యాదగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ ఎం.వెంకన్న తెలిపారు.

## 'మాజీ సర్పంచుల ముట్టడిని విజయవంతం చేయాలి'

మోత్కూరు, ఫిబ్రవరి 4 : పెండింగ్ బిల్లుల కోసం తాజా మాజీ సర్పంచులు బుధవారం చేపట్టనున్న చలో సెక్రటేరియట్, మంత్రుల ఇండ్ల ముట్టడిని విజయవంతం చేయాలని రాష్ట్ర మాజీ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ కార్యదర్శి రాంపాక నాగయ్య కోరారు. మంగళవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం సర్పంచులు ఖర్చు చేసిన రూ.1200 కోట్ల బకాయిలను విడుదల చేయకుండా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బిల్లులు విడుదల చేయాలన నిర్వహించ తలపెట్టిన చలో సెక్రటేరియట్, మంత్రుల ఇండ్ల ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు.

## నులి పురుగుల నివారణపై శిక్షణ

మోటకొండూర్, ఫిబ్రవరి 4 : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలకు మంగళవారం నులి పురుగుల నివారణపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలల్లో నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామని, ఈ నెల 10న జాతీయ నులి పురుగుల దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హారిక, సిబ్బంది పార్వతమ్మ, నర్సయ్య, సుగుణ, అంజుమ్ పాల్గొన్నారు.

## 'మన ఆవులను ఇతర రాష్ట్రాలకు తరలించొద్దు'

రాజాపేట, ఫిబ్రవరి 4 : మన గోవుల సంపదను ఇతర రాష్ట్రాలకు తరలించవద్దని మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చల్లూరు సహాయోగ్ గోశాల నిర్వాహకులు గోవులను కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్నారని, వాటిని ఇక్కడి రైతాంగానికి ఇస్తే మేలు చేకూరుతుందని అన్నారు. గోశాల నుంచి ఆవుల తరలింపు జరుగకకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు కాకల్ల ఉపేందర్, బీరప్ప, ఉప్పలయ్య, రమేశ్, నర్సింహులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులకు భయపడేది లేదు : బాబూరావు

మోత్కూరు, ఫిబ్రవరి 4 : అక్రమ అరెస్టులు చేసి నిర్బంధించినంత మాత్రాన తమ పోరాటాలు ఆగిపోవని మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి బోడ బాబూరావు అన్నారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మంగళవారం చలో అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర కమిటీ పిలుపునివ్వడంతో పోలీసులు తనను ఇంట్లో ఉండగానే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించి నిర్బంధించారన్నారు. అరెస్టులకు భయపడేది లేదని తేల్చిచెప్పారు.

పోలీస్‌స్టేషన్‌లో బాబూరావు

## గుట్టలో వైభవోపేతంగా రథసప్తమి వేడుకలు

ప్రధానాలయ మాఢవీధుల్లో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 4 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో రథ సప్తమి వేడుకలు వైభవోపేతంగా సాగాయి. మంగళవారం ఉదయం స్వామివారిని దివ్య మనోహరంగా అలంకరించి సూర్యప్రభ వాహనంపై వేంచేపు చేశారు. ఆలయ పశ్చిమ రాజగోపురం గుండా మాఢవీధుల్లో సేవను ఊరేగించారు. సాయంత్రం స్వర్ణరథంపై స్వామివారిని వేంచేపు చేసి సేవను కొనసాగించారు.

### పూర్వగిరిలో అధ్యయనోత్సవాలు

పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం అధ్యయనోత్సవాలు వైభవంగా జరిగాయి. మంగళవారం ఉదయం స్వామివారి నిత్య ఆరాధనల అనంతరం తిరుమంజన మహోత్సం నిర్వహించారు. ప్రబంధ పాశురాలను పఠిస్తూ పురప్పాట్ సేవను జరిపారు. స్వామివారి సేవను ఆలయంలో ఊరేగించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం నిత్యారాధనల అనంతరం దివ్య ప్రబంధాన్ని పారాయణికులు పఠిస్తూ పురప్పాట్ సేవను నిర్వహించారు.

## అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ కమిషనర్

అదనపు కలెక్టర్‌కు మొక్క అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్

మోత్కూరు, ఫిబ్రవరి 4 : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, మోత్కూరు మున్సిపల్ ప్రత్యేకాధికారి గంగాధర్‌ను కొత్తగా వచ్చిన మున్సిపల్ కమిషనర్ కె.సతీశ్‌కుమార్ జిల్లా కేంద్రంలోని తన చాంబర్‌లో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు అదనపు కలెక్టర్ సూచించారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● ఎంఎస్ఎంఈ క్లస్టర్ డిస్ట్రిక్ట్ ట్రైనర్ లక్ష్మణ్

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న ఎంఎస్ఎంఈ డిస్ట్రిక్ట్ ట్రైనర్ లక్ష్మణ్

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 4 : సైబర్ నేరాల పట్ల ప్రజలు, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్ఎంఈ) క్లస్టర్ డిస్ట్రిక్ట్ ట్రైనర్ సీత లక్ష్మణ్ అన్నారు. పట్టణంలో ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీపై మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతా ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలు తెలుపవద్దన్